

పేదల ఇళ్ల విషయంలో రాజకీయాలు సిగ్గుచేటు




ప్రజాశక్తి - పాతపట్నం

వైసిపి ప్రభుత్వ హయాంలో నిర్మించిన పేదల ఇళ్లను టిడిపి కూటమి ప్రభుత్వం తాము నిర్మించామని చెప్పుకోవడం సిగ్గుచేటు అని వైసిపి రాష్ట్ర క్రమశిక్షణా కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఒక ప్రకటనలో విమర్శించారు. నిరుపేదల ఇళ్ల విషయంలోనూ కూటమి ప్రభుత్వం రాజకీయాలు చేయడం సరికాదని పేర్కొన్నారు. జగన్ ప్రభుత్వ హయాంలో లక్షలాది మంది నిరుపేదలకు ఇళ్లు, ఇళ్ల స్థలాలను పంపిణీ చేశారని తెలిపారు. దీన్ని కూటమి ప్రభుత్వం గుర్తెరగాలని హితవు పలికారు.

విచారణలో ఏం తేలుస్తారో..?

- దర్యాప్తు మొదలు పెట్టిన పోలీసులు
- పోలీసుల కస్టడీలో ఎనిమిది మంది విద్యార్థులు
- ఇప్పటివరకు ఆత్మహత్యకు ప్రేరేపించిన సెక్షన్ కింద కేసు నమోదు
- దర్యాప్తు ఆధారంగా కేసుల నమోదు : ఎస్‌పి



ఎచ్చెర్ల ట్రిపుల్ ఐటి విద్యార్థి సృజన్ మృతికి సంబంధించి పోలీసులు విచారణ మొదలుపెట్టారు. సీనియర్ విద్యార్థుల వేధింపులతో ఈనెల 13న సృజన్ ఆత్మహత్యకు పాల్పడిన సంగతి తెలిసిందే. దీనిపై పోలీసులు పలు కోణాల్లో దర్యాప్తు మొదలు పెట్టారు. ఘటనకు సంబంధించి నిందితులుగా భావిస్తున్న ఎనిమిది మంది విద్యార్థులను పోలీసులు తమ కస్టడీలోకి తీసుకుని విచారణ సాగిస్తున్నారు. మరోవైపు మృతి చెందిన విద్యార్థి పోస్టుమార్టం నివేదిక కూడా సిద్ధమైనట్లు తెలిసింది. అందులో నివేదిక ఆధారంగా మరిన్ని కేసులు నమోదు చేసే దిశగా చర్యలు ప్రారంభించినట్లు సమాచారం.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

విద్యార్థి మృతికి సంబంధించి పోలీసులు ఇప్పటివరకు రెండు రకాల కేసులు నమోదు చేసినట్లు తెలిసింది. ఘటనతో సంబంధం ఉన్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎనిమిది మందిపై ఆత్మహత్యకు ప్రేరేపించినట్లు భారతీయ న్యాయ సంహిత (బిఎన్ఎస్) సెక్షన్ 108 నమోదు చేశారు. మృతి చెందిన విద్యార్థి ఎస్‌సి సామాజిక తరగతికి చెందిన వాడు కావడంతో ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ చట్టం కింద మరో కేసు నమోదు చేసినట్లు తెలిసింది. విచారణలో భాగంగా ఎనిమిది మంది విద్యార్థులతో కలిసి రూమ్‌లో ఉంటున్న మరో ఐదుగురిని పోలీసులు తీసుకువెళ్లి ఎచ్చెర్ల పోలీస్‌స్టేషన్‌లో వివరాలను రికార్డు చేసినట్లు తెలిసింది. విద్యార్థి మృతదేహానికి రిమ్స్ ఫోరెన్సిక్ ల్యాబ్ వైద్యులు ఈనెల 13వ తేదీన పోస్టుమార్టం పూర్తి చేశారు. ఇందుకు సంబంధించిన నివేదిక పోలీసులకు అందజేసినట్లు సమాచారం. అందులో పేర్కొన్న అంశాల ఆధారంగా మరిన్ని కేసులు నమోదు చేయనున్నట్లు తెలిసింది.

ర్యాగింగ్ చట్టం కింద కేసు వర్తిస్తుందా?

ట్రిపుల్ ఐటిలో చోటుచేసుకున్న ఘటన ర్యాగింగ్ చట్టం కిందకు వస్తుందనే అభిప్రాయాన్ని పలువురు విద్యావేత్తలు చెప్తున్నారు. యుజిసి రెగ్యులేషన్స్ ఆన్ కర్బింగ్ ది మినాన్స్ ఆఫ్ ర్యాగింగ్ 2009 అండ్ రిలవంట్ ఐపిసి సెక్షన్స్ ప్రకారం అన్ని ఉన్నత విద్యాసంస్థల్లో ఇది వర్తిస్తుంది. ర్యాగింగ్‌కు గురైన విద్యార్థి ఫ్రెషరా?, సీనియరా అనే సంబంధం లేకుండా కేసు నమోదు చేయొచ్చని చెప్తోంది. ర్యాగింగ్‌కు పాల్పడిన విద్యార్థుల చర్యలు తోటి విద్యార్థి మృతి, ఆత్మహత్యకు ప్రేరేపించినట్లయితే జీవిత కాలం లేదా కనీసం పదేళ్ల పాటు శిక్ష పడుతుందని చట్టం చెప్తోంది. ఈ చట్టం ప్రకారం రూ.50 వేల అపరాధ రుసుము విధించనున్నారు. విద్యార్థిపై దాడికి పాల్పడితే ఒక సంవత్సరం శిక్ష లేదా రూ.రెండు వేల అపరాధ రుసుము విధిస్తుంది. విద్యార్థి సృజన్ మృతికి సంబంధించి తోటి విద్యార్థులు చెప్తున్న వివరాల ప్రకారం ఈ రెండు వర్తిస్తున్న నేపథ్యంలో పోలీసులు ఎటువంటి కేసులు నమోదు చేయనున్నారో చూడాల్సి ఉంది.

యజమాన్యం ఏం చర్యలు తీసుకోనుందో?

పోలీసులు ర్యాగింగ్ చట్టం కింద కేసు నమోదు చేస్తే, యాజమాన్యం పలు రకాలు చర్యలు చేపట్టే అవకాశం ఉందని చట్టం చెప్తోంది. తరగతి, హాస్టల్ నుంచి సస్పెండ్ చేయాల్సి ఉంటుంది. విద్యార్థి ప్రవేశాన్ని రద్దు చేసే అవకాశాలూ లేకపోలేదు. పరీక్షలతో పాటు విద్యాసంస్థకు ప్రాతినిధ్యం వహించే పోటీల నుంచి డిబార్ చేయొచ్చు. విద్యార్థిని విద్యాసంస్థ నుంచి ఒక పీరియడ్ లేదా ఒకటి నుంచి నాలుగు సెమిస్టర్ల వరకు బహిష్కరించవచ్చు. ప్రత్యేక కాలానికి ఇతర విద్యాసంస్థల్లో చేరకుండా నిషేధం విధించే అవకాశాలు ఉన్నాయి. పోలీసులు ర్యాగింగ్ చట్టం కింద కేసు నమోదు చేస్తారా?, వారు కేసు పెట్టినా యాజమాన్యం ఏ మేరకు చర్యలు తీసుకోనుందో వేచి చూడాల్సి ఉంది.



శ్రీకాకుళం ట్రిపుల్ ఐటి

దర్యాప్తు ఆధారంగా కేసులు



విద్యార్థి మృతికి సంబంధించి కేసు దర్యాప్తు సాగుతోంది. ఆరోపణలు ఎదుర్కొంటున్న విద్యార్థులు పోలీసుల కస్టడీలో ఉన్నారు. వారిని విచారణ చేస్తున్నాం. ప్రస్తుతం ఆత్మహత్యకు ప్రేరేపించిన సెక్షన్ కింద కేసు నమోదు చేశాం. లభ్యమైన ఆధారాలను బట్టి అందుకనుగుణంగా కేసులు నమోదు చేస్తాం.

- కె.వి మహేశ్వరరెడ్డి, ఎస్‌పి

అంగన్వాడీ కేంద్రాలను బలోపేతం చేయాలి

సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు



వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు

ప్రజాశక్తి - రణస్థలం

అంగన్వాడీ సెంటర్లను ప్రీ స్కూల్ పిల్లలతో బలోపేతానికి చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ పాఠశాలల్లో విలీనం ఆపాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు సి హెచ్. అమ్మన్నాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంగన్వాడీ కేంద్రాల బలోపేతానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతూ రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా జె.ఆర్ పురం, కొండములగాం గ్రామ సచివాలయ సిబ్బందికి శుక్రవారం వినతిపత్రాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లో ప్రీస్కూల్ పిల్లలు తగ్గిపోతున్నారని, ఈ కారణం చూపి అంగన్వాడీ సెంటర్లను విలీనం చేయాలని ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందన్నారు. అంగన్వాడీ సెంటర్లలో ప్రీ స్కూల్ బలోపేతం చేయాలంటే 3 నుంచి ఆరేళ్ల లోపు పిల్లలు రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీ కేంద్రాల్లో నమోదయ్యే విధంగా చూడాలని అంగన్వాడీ సెంటర్లోనే ఉండే విధంగా జిఒ ఇవ్వాలని, ప్రీ స్కూల్ పిల్లలకు తల్లికి వందనం అమలు చేయాలని కోరారు. మెనూ పరిమాణాన్ని పెంచాలని, ప్రీ స్కూల్ పిల్లలకు యూనిఫారం, టై, బెల్టు, బూట్లు ఇవ్వాలన్నారు. అంగన్వాడీ పిల్లలకు ఇచ్చే మెనూ, బియ్యం 75 గ్రాములు, పప్పు 15 గ్రాములు, ఆయిల్ ఐదు గ్రాములు ఇస్తున్నారని చెప్పారు. ప్రీ స్కూల్ పిల్లలకు గుడ్లు, పాలు, భోజనం, ఉదయం 12.30 గంటలకే పూర్తవుతుందన్నారు. పిల్లలందరూ సాయంత్రం నాలుగు గంటల వరకు కేంద్రాల్లో ఉంటున్నందున సందర్భంగా స్నాక్స్ అందించాలన్నారు. మండలం కేంద్రమైన జె.ఆర్.పురంలో అంగన్వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేవన్నారు. అంగన్వాడీ కేంద్రాలకు సొంత భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. ఎఫ్ఆర్ఎస్‌ను రద్దు చేయాలని, అంగన్వాడీలకు అదనపు పనులు అప్పగించరాదని, ఆన్‌లైన్ వర్క్ తగ్గించాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం అందించిన వారిలో ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రణస్థలం ప్రాజెక్టు ప్రధాన కార్యదర్శి ఆర్.అప్పమ్మ, నాయకులు బి.స్వాతి, కె.రూప, సుధ, వై.మంగమ్మ తదితరులున్నారు.

లోలుగు కెజిబివిలో డిఎస్‌పి విచారణ



లోలుగు కెజిబివిలో విచారణ చేస్తున్న డిఎస్‌పి వివేకానంద

ప్రజాశక్తి - పొందూరు

మండలంలోని లోలుగు కెజిబివిలో అట్రాసిటీ కేసుపై శ్రీకాకుళం డిఎస్‌పి సిహెచ్.వివేకానంద శుక్రవారం విచారణ చేశారు. మూడు నెలల కిందట కెజిబివిలో భవనంపై నుంచి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఇంటర్మీడియట్ విద్యార్థిని ఫిర్యాదు చేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ లలితకుమారి, సమగ్ర శిక్ష ఎపిసి శశిభూషణరావు దూషణల కారణంగానే తాను ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈమేరకు నమోదైన అట్రాసిటీ కేసుకు సంబంధించి డిఎస్‌పి పాఠశాలలో ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, గ్రామస్తులను పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు ఎస్ఐ వి.సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

నేటి బాలలే రేపటి పౌరులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

నేటి బాలలే రేపటి పౌరులని, అటువంటి బాలలకు ఉజ్వల భవిష్యత్ అందించే బాధ్యత ప్రతి ఒక్కరిదీ అని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆడిటోరియం, న్యూ సెంట్రల్ స్కూల్‌లో శుక్రవారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలలంతా పాఠశాలల్లోనే ఉండాలన్నారు. వారి హక్కులను పరిరక్షించాలన్నారు. పిల్లలు సమాజం, పెద్దలు, గురువులపై గౌరవంతో ఉంటూ సమాజం గర్వించదగ్గ పౌరులుగా మెలగాలన్నారు. ఆహ్లాద కరమైన వాతావరణంలో బాలలు ఎదిగే అవకాశాలు కల్పించాలన్నారు. బాలల హక్కులు పరిరక్షిస్తూ వారి భవిష్యత్‌కు బంగారు బాటలు వేయాలన్నారు. బడిఈడు పిల్లలు బడి వెలుపల ఉండరాదన్నారు. బాలలకు న్యాయపరమైన సలహాలు, సూచనలు చెప్పి గుడ్, బ్యాడ్ టచ్ గురించి అవగాహన కల్పించారు. బాలలు స్నేహపూర్వక న్యాయ సేవలు అనే నల్సా స్కీమ్‌పై అవగాహన కల్పించారు. బాల్య వివాహాల చట్టం, అసమానతలు గురించి వివరించి వాటిని అరికట్టాలన్నారు. కార్యక్రమంలో డిఎస్‌పి వివేకానంద, ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఆఫీసర్, కళాశాల ప్రిన్సిపల్, డిసిపిఒ రమణ, న్యాయవాది జి.ఇందిరాప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి హరిబాబు

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఎక్కడ?

ప్రజాశక్తి - నరసన్నపేట

జిల్లాలో పంట చేతికొచ్చినా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఇంకా ప్రారంభించలేదని వైసిపి నాయకులు ధర్మాన కృష్ణచైతన్య మండిపడ్డారు. ఇప్పటివరకు ఒక్క కొనుగోలు కేంద్రాన్నీ తెరవకపోవడం సిగ్గుచేటు అని అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మొంథా తుపానుతో తడిసిన, రంగు మారిన ధాన్యాన్ని రైతు ఇంట్లో పెట్టుకోలేక రోడ్లపై టార్పాలిన్లతో దాచుకోవాల్సిన దుస్థితి నెలకొందన్నారు. ఫలితంగా దళారులకు అమ్ముకోవాల్సిన పరిస్థితిని ప్రభుత్వం కల్పించిందని విమర్శించారు. జిల్లాలో ఆరు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యం కాగితాలపైనే ఉండిపోయిందన్నారు.

వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు సొంత జిల్లాలోనే రైతుల పరిస్థితి ఇంత దారుణంగా ఉందన్నారు. కొనుగోలు కేంద్రాలు పనిచేస్తున్నాయి, 48 గంటల్లో డబ్బులు చెల్లిస్తున్నామనే మంత్రుల ప్రకటనలు ప్రచారానికి మాత్రమే పరిమితమన్నారు. ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకుని కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే రైతులతో కలిసి ఉద్యమం తప్పదని హెచ్చరించారు. సమావేశంలో జెడ్‌పిటిసి చింతు రామారావు, పొందర కూరకుల విభాగం రాష్ట్ర అధ్యక్షులు రాజపు అప్పన్న, జిల్లా బూత్ కమిటీ అధ్యక్షులు దామ మన్మథరావు, రాష్ట్ర రైతు కార్యదర్శి కనపల శేఖరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎస్‌కెల్లో పంట జాబితాల ప్రదర్శన

వ్యవసాయ శాఖ జెడి మనోహర్ ప్రసాద్

ప్రజాశక్తి - ఆమదాలవలస

ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగు చేసిన పంటల వివరాలను పారదర్శకత కోసం సామాజిక తనిఖీకి ఉంచుతూ జిల్లావ్యాప్తంగా అన్ని రైతు సేవా కేంద్రాల్లో పంట జాబితాలను ప్రదర్శించినట్లు వ్యవసాయశాఖ సంయుక్త సంచాలకులు ఎస్.వి.వై.ఎస్ మనోహర్ ప్రసాద్ తెలిపారు. వ్యవసాయ వ్యవస్థలో పారదర్శకత బాధ్యతాయుత విధానాలకు ఇది కీలకమన్నారు. మండలంలోని కొర్లకోట రైతు సేవా కేంద్రంలో పంటల జాబితాను శుక్రవారం ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తమ పేర్లు, భూ వివరాలు, పంటల రకాలు, సాగు విస్తీర్ణం వంటి అంశాలను జాబితాలలో కచ్చితంగా పరిశీలించాలన్నారు. ఎక్కడైనా తప్పులు ఉన్నా వెంటనే రైతు సేవా కేంద్రంలోని వ్యవసాయ సిబ్బందికి తెలియజేసి సవరణలు చేసుకోవాలని సూచించారు. ఈ సామాజిక తనిఖీ వ్యవస్థతో రైతులకు చేకూరే ప్రయోజనాలు, పథకాల అమలు భవిష్యత్ పంట ప్రణాళికలో కీలకపాత్ర పోషించనుందని తెలిపారు. మండల వ్యవసాయ అధికారి మెట్ట మోహనరావు మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాలు రైతులకు అందించే సేవలను మరింత పారదర్శకంగా చేయడం కోసం ఈ ప్రక్రియ అవసరమని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు పంట నమోదు, సబ్సిడీలు, పథకాల ప్రయోజనాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ప్రతి రైతు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ వివరాలు సరిగా ఉన్నాయో, లేదో పరిశీలించుకోవాలని సూచించారు. పంట రిజిస్ట్రేషన్‌లో తప్పులు ఉంటే భవిష్యత్‌లో పథకాల ప్రయోజనాలు పొందడంలో ఇబ్బందులు ఎదురుకావచ్చని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి సనపల అప్పలనాయుడు, వ్యవసాయ సహాయకులు ఎన్.పోలరాజు వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.



కొర్లకోట ఆర్ఎస్‌కెలో పంటల జాబితాను ప్రదర్శిస్తున్న మనోహర్ ప్రసాద్

అవగాహనతో మధుమేహం దూరం

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

అవగాహనతో మధుమేహానికి దూరంగా ఉండవచ్చని ఇన్‌ఛార్జి జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి మేరీ కేథరిన్ అన్నారు. ప్రపంచ మధుమేహ దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయం నుంచి ఏడురోడ్ల కూడలి వరకు నిర్వహించిన ర్యాలీని ప్రోగ్రాం అధికారి డాక్టర్ శివరంజనితో కలిసి జెండా ఊపి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొన్ని ఆరోగ్య సూత్రాలు పాటిస్తే మధుమేహం నియంత్రణలో ఉంటుందన్నారు. ప్యాంక్రియాస్ ద్వారా తగినంత ఇన్సులిన్ ఉత్పత్తి కాకపోయినా, ఇన్సులిన్ ఉత్పత్తిని సమర్థవంతంగా వినియోగించుకోలేకపోవడాన్నే మధుమేహం అంటారని తెలిపారు. వైద్యుల సూచనలతో పాటు ఆరోగ్యకరమైన బరువు ఉండడం, ప్రతిరోజూ అరగంట వ్యాయామం చేయడం, శారీరకంగా చురుకుగా ఉండాలన్నారు. ఈ ఏడాది మధుమేహం ముప్పు - అందరికీ ఉందని చెప్పు అన్న థీమ్‌తో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వాలు, ఆరోగ్య సంస్థలు సహకారం అందించడమే లక్ష్యంగా ముందుకు రావాలన్నదే దీని ఉద్దేశమన్నారు. అనంతరం మేరీ కేథిరన్‌తో పాటు ప్రోగ్రాం అధికారులు, వైద్యారోగ్యశాఖ కార్యాలయ సిబ్బంది షుగర్ పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు డాక్టర్ రాందాస్, రవీంద్ర, జి.వి లక్ష్మి, సుజాత, ఎస్.ఒ రామ్ నాగేశ్వరరావు, డిఎంఒ సత్యనారాయణ, డిపిఒ మురళి తదితరులు పాల్గొన్నారు.



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న ఇన్‌ఛార్జి డిఎంహెచ్ఒ మేరీ కేథరిన్

పాలకుల నిర్లక్ష్యం వల్లే కళింగాంధ్ర వెనుకబాటు

ప్రజాశక్తి - అరసవల్లి

పాలకుల నిర్లక్ష్యం కారణంగానే కళింగాంధ్ర వెనుకబాటుకు గురైందని పలువురు వక్తలు పేర్కొన్నారు. నగరంలోని ఎన్‌టిఆర్ మున్సిపల్ హైస్కూల్ మైదానంలో నిర్వహిస్తున్న సిక్కోలు పుస్తక మహోత్సవంలో భాగంగా నాలుగో రోజు శుక్రవారం 'కళింగాంధ్ర వెనుకబాటు, సాహిత్యం, మీడియా ప్రజాసంఘాల కర్తవ్యాలు' అంశంపై చర్చాగోష్టి నిర్వహించారు. ఈ సందర్భంగా రచయిత, సాహితీ స్రవంతి విజయనగరం జిల్లా అధ్యక్షులు చీకటి దివాకర్, రచయిత లీలాప్రసాద్ మాట్లాడుతూ కళింగాంధ్ర వివక్షకు గురైందన్నారు. రచయిత పి.వి నరసింహులు మాట్లాడుతూ సిక్కోలు పుస్తక మహోత్సవం మహోన్నత కార్యక్రమం అన్నారు. పుస్తకాలు చదవడం ద్వారా సంస్కారవంతమైన జీవనం కొనసాగించవచ్చని చెప్పారు. సీనియర్ జర్నలిస్ట్ సన్యాసిరావు, కె.శ్రీనివాసరావు తదితరులు మాట్లాడారు.



జీవనగానం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రచయితలు

అనంతరం రచయిత్రి మజ్జి భారతి రచించిన 'జీవన గానం' పుస్తకాన్ని ఆవిష్కరించారు. రచయిత కలమట దాసుబాబు పరిచయం చేశారు. రచయితలు అట్టాడ అప్పలనాయుడు, గంటేడ గౌరునాయుడు రచించిన 'కళింగ కథాజాడ' సంకలనం పుస్తకాన్ని రచయిత్రి మజ్జి భారతి పరిచయం చేశారు. అనంతరం ఆర్.వి రమణమూర్తి, బి.ఉమా మహేశ్వరరావు, బి.కోమలరావు, గుడిమెట్ల గోపాలకృష్ణ కవి సమ్మేళనంలో పాల్గొన్నారు. గాయకులు కుత్తుం ప్రసాద్ 'తెల్లా తెల్లావారే మన పల్లెలు ఏమాయే' జానపద పాట పాడి అలరించారు.



పుస్తకాలు చదువుతున్న పిల్లలు

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

దుర్యోధన మాస్టారు దుర్యోధన ఏకపాత్రాభినయంతో మయసభ సీన్‌ను రక్తి కట్టించారు. శంకరరావు మాస్టారు అల్లూరి సీతారామ రాజు ఏకపాత్రాభినయం, బాడగల చిన్నారావు జాలారి నృత్యం అలరించింది. చిన్నారుల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. మరోవైపు వైజ్ఞానిక ప్రదర్శనలు జన విజ్ఞాన వేదిక ప్రతినిధి కూర్మారావు నిర్వహించారు. సైన్స్ కార్యక్రమాలపై విద్యార్థులు, చిన్నారులు ఆసక్తి కనబరిచారు. పుస్తక ప్రదర్శనను తిలకించి పలు పుస్తకాలను కొనుగోలు చేశారు.

నేటి కార్యక్రమాలు

నాలుగు గంటలకు సైన్స్ వైజ్ఞానిక కార్యక్రమాలు. కడపకు చెందిన బాల భాయన్న ఆధ్వర్యాన మ్యాజిక్ షో. ఐదు గంటలకు 'కళింగాంధ్ర కవిత'పై చర్చాగోష్టి. అనంతరం 'ఆమెకు మిగలని ఆమె', 'గచ్చేం చెట్టుకు అటు ఇటు' పుస్తకావిష్కరణలు. గొర్లె వెంకటరావు బృందం ఆధ్వర్యాన ఎరుకల పాట, సాంఘిక నాటిక జానపద నృత్యం, కళాశాల విద్యార్థులతో పాశ్చాత్య నృత్యాలు. ఎం.వాసుదేవాచారి గజల్స్.





దుర్యోధన, అల్లూరి సీతారామరాజు ఏకపాత్రాభినయాలు



ఘనంగా బాలల దినోత్సవం


ఇచ్ఛాపురం : ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న తహశీల్దార్ వెంకటరావు


పొందూరు : మాట్లాడుతున్న జూనియర్ సివిల్‌జడ్జి బి.జ్యోత్స్న



కొత్తూరు : విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న జడ్జి రాణి

ప్రజాశక్తి- లావేరు

మండలం తామాడ ఆదర్శ పాఠశాలలో శుక్రవారం బాలల దినోత్సవాన్ని పాఠశాల ప్రిన్సిపాల్ డానియల్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ జన్మదినం పురస్కరించుకొని ప్రతిఏటా నవంబర్ 14న బాలల దినోత్సవం జరుపుకుంటామని గుర్తు చేశారు. అనంతరం విద్యార్థులు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ ఇంజి రాపు శ్రీనివాసరావు, ఉధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అలాగే స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నెహ్రూ జయంతిని హెచ్‌ఎం పసుపుల జగన్నాథం అధ్యక్షతన నిర్వహించారు. నెహ్రూ చిత్రపటానికి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పిసిని వసంతరావు, అరసవెల్లి వరలక్ష్మి, కూన నారాయణ బాబు, కోట్ల సూర్యనారాయణ, గోగుల ఉషారాణి, శివ్వాల పుణ్యావతి, సంజీవి నళినీ సుధాకర్, పక్కి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బూర్జ: మండలంలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పిల్లలకు క్విజ్ పోటీలు, క్రీడలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఇఒ ధనుంజయరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సంతబొమ్మాళి: మండలంలోని దండు గోపాలపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం పిట్ట గంగన్న ఆధ్వర్యంలో బాలల దినోత్సవం నిర్వహించారు. యామలపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు ఆది కేశవరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఉపాధ్యాయులు, విద్యాకమిటీ ఛైర్మన్‌లు పాల్గొన్నారు.

కవిటి: బాల్యం ఓ గొప్ప వరమని, ఒసారి కోల్పోతే తిరిగి రాదని మండల విద్యాశాఖ అధికారులు ధనంజయ మజ్జి, ససపల రామకృష్ణ అన్నారు. బాలలదినోత్సవ వేడుకలు మండలంలోని పలు పాఠశాలలు, కళాశాలల్లో వేడుకగా నిర్వహించారు. కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఎంపిపి పాఠశాల, రాజపురం, బొరివంక, బిజి పుట్టుగ, కుసుంపురం, ముత్యాలపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, కవిటి బివికె, ఎస్‌విబి డిగ్రీ కళాశాల, కళ్యాణి ఆంగ్ల పాఠశాల, ప్రగడపుట్టుగ ఎంపియుపి పాఠశాలల్లో విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

ఇచ్ఛాపురం: జ్ఞానధార పాఠశాలలో సిఇఒ సెక్రెటరీ జోహార్ ఖాన్ ఆధ్వర్యంలో బాలల దినోత్సవం నిర్వహించారు. తహశీల్దార్ వెంకట్రావు, ఎంఇఒ కె.అప్పారావు, హైకోర్టు న్యాయవాది ఎన్.వివేకానంద్, హిందీ భాష పండితులు ఎల్.చిరంజీవిరావు పాల్గొని నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. మీనా బజార్ పేరిట నిర్వహించిన ఫుడ్ ఫెస్టివల్‌ను ప్రారంభించారు.

సైన్స్ ఎగ్జిబిషన్

పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను అతిథులు ప్రారంభించారు. సుమారు 30కిపైగా మోడల్స్‌ను విద్యార్థులు అత్యద్భుతంగా ప్రదర్శించారు. కార్యక్రమంలో పాఠశాల ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ వజ్రపు రమణమూర్తి, ప్రిన్సిపాల్ బి బి వండా, మేనేజర్ ప్రమోద్ కుమార్, అదనపు పరిపాలన అధికారి సయదాసుల్తానా, ట్రాన్స్‌పోర్ట్ మేనేజర్ అలీమ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.


అరసవల్లి : వివిధ వేషధారణలతో చిన్నారులు

కోటబొమ్మాళి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలల దినోత్సవం నిర్వహించారు. నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. స్థానిక జూనియర్ సివిల్ జడ్జి రోషిణి ఆదేశాల మేరకు విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు మండల న్యాయసేవాధికార సంఘం అధ్యక్షులు ఎల్.శ్రీనివాస్ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఎంఇఒ డి.గోవిందరావు, ఉపాధ్యాయులు ఎస్.సంజీవరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల: మండల ధర్మవరంలో నెహ్రూ జయంతి సందర్భంగా మేము సైతం - స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో బాలల దినోత్సవం నిర్వహించారు. స్థానికంగా ఉన్న రెండు ప్రాథమిక పాఠశాలలో నెహ్రూ చిత్రపటానికి సంస్థ అధ్యక్షులు టికె ఆచారి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం క్రీడల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రధాన కార్యదర్శి బాన్న నాగేశ్వరరావు, సభ్యులు కె.ప్రకాష్, దుగ్గు లక్ష్మణరావు, బి.సత్యనారాయణ, బస్వా శ్రీనివాసరావు, శంకర్, ఉపాధ్యాయులు అమ్మన రావు, కృష్ణయ్య, రామారావు, లక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆమదాలవలస: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. హెచ్‌ఎం కె.ఎ.రాములు, ఇన్‌ఛార్జి హెచ్‌ఎం పై రవికుమార్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్, సామాజిక శాస్త్ర ఉపాధ్యాయులు బి.ఎ.శివాజి, స్టాఫ్ సెక్రెటరీ పైడి రామస్వామి నాయుడు, ఉపాధ్యాయులు పి.మోహనరావు, జి.అప్పారావు, కోట ఈశ్వర్, షేక్ షావలి, ఎం.వి.ఆర్ భద్రు తదితరులు పాల్గొన్నారు.

నరసన్నపేట: స్థానిక బోర్డు స్కూల్‌లో బాలల దినోత్సవం నిర్వహించారు. ఈ విద్యార్థులకు స్పోర్ట్ దుస్తులు పంపిణీ చేశారు. నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఆర్.ఎస్ నాయుడు, ఉప సర్పంచ్ సాసుపల్లి కృష్ణబాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

పొందూరు: మండల కేంద్రంలోని ఒకటో నెంబర్ పాఠశాలలో బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జవహర్‌లాల్ చిత్రపటానికి జూనియర్ సివిల్ జడ్జి బి.జ్యోత్స్న పూలమాలవేసి నివాళ్లర్పించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శరత్‌కుమార్, న్యాయవాదులు బ్రహ్మాజీ, అశోక్, రాము, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని అంగన్వాడీ 4, 9 కేంద్రాల్లో బాలల దినోత్సవ వేడుకలు నిర్వహించారు. సిడిపిఒ సత్యశ్రీ, సూపర్‌వైజర్ సుజాత, కార్యకర్తలు డి.రమాదేవి, డి.లక్ష్మి, సచివాలయ సిబ్బంది వై.భారతి, ఆర్.హారిక, బెజ్జిపురం యూత్‌క్లబ్ సభ్యులు కె.శ్రావణి, అప్పలనాయుడు పాల్గొన్నారు. అలాగే మలకాం ప్రాథమికోన్న పాఠశాలలో గురుగుబెల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో విద్యాకమిటీ ఛైర్మన్ కె.నగేష్‌కుమార్, వైస్ ఛైర్మన్ సునీత, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

టెక్కలి: నెహ్రు జయంతి సందర్భంగా గ్రంథాలయంలో నెహ్రూ చిత్రపటానికి టిడిపి పట్టణ అధ్యక్షులు కోళ్ల లవకుమార్ పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. గ్రంథాలయాధికారి బి.రూపావతి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు దళ్లి ప్రసాద్‌రెడ్డి, రెయ్యి ప్రీతీష్‌చంద్, ప్రఫుల్లకుమార్ బరోడా, జర్జాన రాంజీ, ఆట్టాడ శ్రీధర్, విశ్రాంత గ్రంథాలయాధికారి గున్న ప్రసాదరావు, ఆర్‌టిసి సూపర్‌వైజర్ ఆర్.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అలాగే పోస్టాఫీస్‌లో సామాజిక విభాగం కన్వీనర్ హనుమంతు ఉదయ్‌భాస్కర్ చేతులమీదుగా ఆధార్ నమోదు, సవరణల కోసం వచ్చిన విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబూరు గోవిందమ్మ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బేపల సతీష్‌కుమార్, లూక్‌పాల్, ఝాన్సీరాణి, కందిగోల్ల, వాసుబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొత్తూరు: బాలల దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జూనియర్ సివిల్ కోర్ట్ జడ్జి కందికట్ల రాణి ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఇందులో ప్రథమ బహుమతి ఎందవ మౌర్యక్రాంత్, ద్వితీయ బహుమతి బోనాల ఇందిరా, తృతీయ బహుమతి డొక్కా అర్చనలకు జడ్జి చేతులమీదుగా ప్రధానం చేశారు. కార్యక్రమంలో బార్ అధ్యక్షులు ఎం.అప్పారావు, న్యాయవాదులు గేదెల పాల్గొనరావు, ధర్మారావు, రవికిరణ్ రాజు, ప్రసాద్, జానకిరాములు, ఇన్‌ఛార్జి హెచ్‌ఎం చిన్నమ్మడు, ఎఎస్‌ఐ రాజేశ్వరరావు పాల్గొన్నారు.



శ్రీకాకుళం : పుస్తకాలు పంపిణీ చేస్తున్న ప్రతినిధులు


లావేరు : నెహ్రూ చిత్రపటానికి నివాళ్లర్పిస్తున్న ఉపాధ్యాయులు


బూర్జ : నెహ్రూ చిత్రపటానికి నివాళ్లర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు


సంతబొమ్మాళి : బాలల దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

అరసవల్లి: బాలల దినోత్సవం సందర్భంగా ఎన్‌టిఆర్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో మిమిక్రీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో బాలల దినోత్సవం నిర్వహించారు. చిన్నారులు జవహర్ లాల్ నెహ్రూ వేషధారణతో అలరించారు. చిన్నారులకు బహుమతులు, సర్టిఫికెట్లును అందజేశారు. కార్యక్రమంలో గాయత్రి కళాశాల తెలుగు విభాగాధిపతి బి.గౌరీశంకర్, నటుకులమోహన్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం సిటీ: పట్టణంలోని ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో నెహ్రూ జయంతిని కాంగ్రెస్ పార్టీ నిర్వహించింది. నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌ఛార్జి గాదం వెంకట త్రినాధరావు, కాంగ్రెస్ నాయకులు అంబటి కృష్ణారావు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు రెల్ల సురేష్, డిసిసి ఉపాధ్యక్షులు కెవిఎల్‌ఎస్ ఈశ్వరి, డిసిసి ప్రధాన కార్యదర్శి సాయిదుల్లా ఖాన్ పాల్గొన్నారు.

ఐద్వా నగర కమిటీ ఆధ్వర్యంలో బాలల దినోత్సవం పురస్కరించుకొని దమ్మల వీధిలో బాలలతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నగర అధ్యక్ష, కార్యదర్శులు డి.సూర్యుడమ్మ, టి.ప్రవీణ మాట్లాడుతూ పిల్లల్లో మానసికల్లాసం పెంపొ ఒందించేందుకు ఆటలు, పాటలు ఎంతో దోహదపడతాయన్నారు. పుస్తకదాతలు రాయితీ చంద్రశేఖర్, రాయితీ శ్రీనివాసులు పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా కన్వీనర్ అల్లాడ లక్ష్మి, నగర కమిటీ సభ్యులు జి.అనురాధ, డి.లక్ష్మి, ఎం.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


పిఒకు వినతిపత్రం అందజేస్తున్న గిరిజన సంఘం నాయకులు

విద్యుత్ బిల్లులు తగ్గించాలి

ప్రజాశక్తి- కొత్తూరు

అధిక విద్యుత్ బిల్లులు తగ్గించాలని, 200 యూనిట్ల విద్యుత్ సబ్సిడీని ఆదివాసీలందరికీ కొనసాగించాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి నిమ్మక అప్పన్న రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మండలంలోని గొట్టిపల్లి, భూతలగూడ, ఇరపాడుగూడ, ఇరపాడు, కొత్తగూడ ఆదివాసీ గిరిజనులతో సీతంపేట ఐటిడిఎ పిఒకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అప్పన్న మాట్లాడుతూ విద్యుత్ శాఖ అధికారులు అధికంగా వచ్చిన కరెంట్ బిల్లులు కట్టకపోతే విద్యుత్ మీటర్ తీసుకు వెళ్లిపోతామంటున్నారని, ఇది దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆదివాసీలందరికీ ఉచితంగా ఇస్తామన్న 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సబ్సిడీకి అర్థం లేదని, ఒక్కొక్కరి బిల్లులు రూ.30 వేలు, రూ.50వేలు వరకు వస్తున్నాయని, తక్షణమే అధిక బిల్లులు తగ్గించి 200 యూనిట్లు సబ్సిడీని కొనసాగించాలని పిఒను కోరారు. లేనియెడల పెద్దఎత్తున ఆదివాసీలతో ఉద్యమం చేపడతామన్నారు. ఈయనతో పాటు సవర మోహనరావు, సవర జమ్మయ్య, సవర దుర్గారావు, సవర పోలయ్య, సవర రమేష్ గిరిజనులు తదితరులు పాల్గొన్నారు.


సబ్ డిపో ఏర్పాటు చేయాలని కోరుతున్న గిరిజనులు

గిరిజనులకు రేషన్ ఇబ్బందులు

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని ముకుంధపురం పంచాయతీకి చెందిన ముకుంధపురం, సవర ముకుంధపురం, మూలముకుంధపురం తదితర గ్రామాల గిరిజనులు రేషన్‌కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం రేషన్‌డిపో 15 కిలోమీటర్ల దూరంలోని సుందరాడలో ఉండటంతో గిరిజనులు రేషన్ సరుకులు తెచ్చుకునేందుకు ఎక్కువ దూరం ప్రయాణం చేయాల్సి వస్తోంది. ఈ సమస్యను పరిష్కరించేందుకు ముకుందపురం సర్పంచ్ సవర భాస్కరరావు శుక్రవారం తహశీల్దార్ బడే పాపారావుకు వినతిపత్రం అందించారు. గ్రామానికి సమీపంలో, డబారులో సబ్‌డిపో ఏర్పాటు చేయాలని వినతిలో కోరారు. కార్యక్రమంలో పలువురు గిరిజనులు పాల్గొని తమ సమస్యలను అధికారులకు వివరించారు. స్థానికులు త్వరితగతిన సబ్‌డిపో ఏర్పాటు చేసి తమకు ఉన్న ఇబ్బందులను తొలగించాలని కోరారు.

13న లోక్ అదాలత్

ప్రజాశక్తి- సోంపేట

డిసెంబర్ 13న స్థానిక కోర్టుల సముదాయం వద్ద జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు ఆరవ అదనపు జిల్లా జడ్జి కె.కిషోర్ బాబు తెలిపారు. శుక్రవారం సోంపేట, మందస, కంచిలి, బారువ పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయా స్టేషన్ల పరిధిలో రాజీ పడదగ్గ కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. జాతీయ లోక్ అదాలత్‌లో వీలైనన్ని ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి జె.శ్రీనివాసరావు, జూనియర్ సివిల్ జడ్జి కె.శ్రీనివాసరావు, సోంపేట, మందస సిఐలు, ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జడ్జి కిషోర్ బాబు


జలజీవన్ మిషన్ పనులు పరిశీలిస్తున్న కూటమి నాయకులు

జల జీవన్ పనులు పరిశీలన

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని రాపాక అంబేద్కర్ కాలనీలో చేపడుతున్న జలజీవన్ మిషన్ పనులను శుక్రవారం కూటమి నాయకులు పరిశీలించారు. కాలనీలోని వీధుల్లో వేసిన పైప్‌లైన్‌ను, ఇంటి కొళాయిల కనెక్షన్లులో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని వీధి వాసులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా తెలుగు యువత కార్యదర్శి బలగ శంకరభాస్కరరావు, మండల తెలుగు యువత అధ్యక్షుడు కండాపు శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పురస్కారాలు అందజేత

టెక్కలి: మండలంలోని తలగాం ఎట్ నౌపడా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతూ ఇటీవల జరిగిన పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన 50 మంది విద్యార్థులకు శుక్రవారం ప్రతిభా పురస్కారాలు పాఠశాల హెచ్‌ఎం పేడాడ అమ్మనమ్మ చేతులమీదుగా అందజేశారు. బిగ్‌హెల్ప్ అసోసియేషన్ సౌజన్యంతో నగదు పురస్కారాన్ని అందించారు. అనంతరం విద్యార్థులకు అవసరమైన పరీక్షా సామగ్రిని అందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రాజెక్టు డైరెక్టర్ బోడ్డేపల్లి విద్యావతి, పొందర అప్పారావు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


నిత్యావసర సరుకులను అందజేస్తున్న నాయకులు

నిత్యావసర సరుకుల పంపిణీ

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని తోలాపిలో ఎమ్మెల్యే కూన రవికుమార్ సోదరుడు, మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు కూన వెంకట సత్యనారాయణ చేతులమీదుగా శుక్రవారం చేనేత కార్మికులకు నిత్యవసర సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మొంథా తుపాను వలన నష్టపోయిన చేనేత కార్మికులకు 50 కేజీల బియ్యం, కేజీ చొప్పన కందిపప్పు, ఉల్లిపాయలు, బంగాళ దుంపలు వంటి నిత్యవసర సరుకులను అందజేశారు. కార్యక్రమంలో ఎంపిటిసి కళ్యాణి, టిడిపి నాయకులు పి.రామారావు, రమణమూర్తి, అప్పలనాయుడు, గంగాధరరావు, సత్యం, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్

ప్రజాశక్తి- పోలాకి

ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్ కార్యక్రమమని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. మండలం కత్తిరివానిపేట క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. సమస్యలపై ప్రజల నుంచి వచ్చిన వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఇచ్చిన అర్జీలను సంబంధిత అధికారులకు అందజేసి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. నరసన్నపేట, పోలాకి, జలుమూరు, సారవకోట మండలాల నుంచి అధిక సంఖ్యలో వినతులు వచ్చాయి.

అన్న సంతర్పణ

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

గోపినాధపురం గ్రామంలోని శ్రీను గురుస్వామి సేవా సంఘం ఆధ్వర్యంలో వందలాది మందికి అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం గురుస్వామి శ్రీను ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి అంబలం పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ప్రత్యేకంగా కుంకుమ పూజ నిర్వహించారు. గత కొన్నేళ్లుగా అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు శ్రీను గురుస్వామి తెలిపారు.

రమేష్ కుటుంబానికి దాతల అండ

ప్రజాశక్తి- కవిటి

అనుకోని ప్రమాదంలో మృత్యువాత పడ్డ గొండ్యాలపుట్టుగకు చెందిన లారీడ్రైవర్ రమేష్ కుటుంబానికి దాతలు అండగా నిలుస్తున్నారు. రమేష్ కుటుంబ దయనీయస్థితి వివరిస్తూ శుక్రవారం ప్రజాశక్తిలో వచ్చిన 'మామయ్య.. నాన్నేరి' కథనానికి అనూహ్య స్పందన లభిస్తోంది. అందులో భాగంగా దూగానపుట్టుగ గ్రామానికి చెందిన స్నేహితా ఫౌండేషన్ సభ్యులు శుక్రవారం రమేష్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. అధైర్య పడొద్దు.. అండగా ఉంటామని హామీ ఇచ్చారు. తమవంతుగా రూ.5 వేలు ఆర్థిక సాయం అందించారు. అలాగే గొండ్యాలపుట్టుగలో 9 ఏళ్లు విధులు నిర్వహించిన ఉపాధ్యాయులు హేమలత చిన్నారులకు రూ.5వేలు అందించారు. అంతేకాకుండా దాతలు మానవతా దృక్పథంతో ముందుకు వచ్చి రమేష్ కుటుంబానికి అండగా నిలవాలని కోరారు.

చిన్నారుల చదువు బాధ్యత నాది: లోళ్ల రాజేష్


పరామర్శిస్తున్న రాజేష్

ప్రమాదంలో మరణించిన రమేష్ ముగ్గురు పిల్లల చదువు బాధ్యత తనదని కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ లోల్ల రాజేష్ అన్నారు. రమేష్ కుటుంబ సభ్యులను శుక్రవారం ఉదయం రాజేష్ పరామర్శించారు. ప్రమాద సంఘటన వివరాలు తెలుసుకొని బాధితులను ఓదార్చారు. చిన్నారులకు తమ కల్యాణి ఆంగ్ల పాఠశాలలో ఉచితంగా చదువు అందిస్తానని హామీ ఇచ్చారు.


మాట్లాడుతున్న శాస్త్రవేత్త చిట్టిబాబు

ప్రజాశక్తి- నరసన్నపేట

రబీలో వేసే పంటలకు సస్య రక్షణపై రైతులకు అవగాహన ఉండాలని వ్యవసాయ శాఖ ఎడి వెంకట మధు సూచించారు. శుక్రవారం నరసన్నపేట రైతుసేవా కేంద్రంలో నియోజకవర్గం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. పిఎం రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకంలో భాగంగా, జిల్లా

సస్యరక్షణపై అవగాహన

వనరుల కేంద్రం ఆధ్వర్యంలో రబీ 2025- 26 సీజన్‌లో వివిధ పంటల్లో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యలపై, రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు అందించే సేవలపై నరసన్నపేట, పోలాకి, జలుమూరు సారవకోట మండలాల రైతు సేవా కేంద్రాల ఇన్‌ఛార్జిలకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. రబీ పంటలైన అపరాలు, వేరుసెనగ, నువ్వులు, మొక్కజొన్న పంటల్లో ఎరువుల యాజమాన్యం పద్ధతులు, పురుగు, తెగులు యాజమాన్యంపై వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ పరిశోధన స్థానం ఆమదాలవలస ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ జి. చిట్టిబాబు, జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి వై.సురేష్, పోలాకి మండల వ్యవసాయాధికారి పి.చిరంజీవి, నరసన్నపేట ఎఒ సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

కృత్రిమ మేధస్సు పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి ఐతమ్ ఇంజనీరింగ్ కళాశాలలో మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగానికి చెందిన అధ్యాపకులు డా కె.వేణుగోపాల్, డా.అగురుకోసం వెంకట సత్యనారాయణ, డా ఎం.ఎస్.ఆర్. నాయుడు, శాఖ హెచ్‌ఒడి డా ఎన్.లక్ష్మీ శ్రీకాంత్‌ల సంయుక్త సమన్వయంతో రచించిన 'ఎ.ఐ ఫర్ అకాడెమియా ది వరస్ట్ బ్యూటీ' పుస్తకాన్ని కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి. నాగేశ్వరరావు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడిన డైరెక్టర్ 'కృత్రిమ మేధస్సు ఈనాటి విద్యా వ్యవస్థను కొత్త దిశలో మలుస్తోందన్నారు. మేనేజ్‌మెంట్ స్టడీస్ రంగంలో ఎ.ఐ అనువర్తనాలను విద్యార్థులకు చేరువ చేస్తూ, పరిశోధనా అవకాశాలను వెలికితీసే దిశగా ఈ గ్రంథం విశిష్టమైన పాత్ర పోషిస్తుందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎస్.శ్రీనివాసరావు, డీన్ ఆర్ అండ్ డి. డా డి శ్రీరాములు, డీన్ ఐఐసి డా జి.సతీష్ కుమార్, హెచ్‌ఒడి, అధ్యాపకులు, ఇతర సిబ్బంది పాల్గొని రచయితలను అభినందించారు.



రచయితలను అభినందిస్తున్న డైరెక్టర్ తదితరులు

విద్యార్థులు పట్టుదలతో విజయం సాధించాలి


విద్యార్థులకు సూచనలు చేస్తున్న రాంబుడ్డి గణపతి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ప్రతి విద్యార్థి బాల్యదశ నుంచే పట్టుదలతో విజయం సాధించాలని ప్రముఖ మనోవికాస్ నిపుణులు రాంబుడ్డి గణపతి విద్యార్థులకు హితవు పలికారు. స్థానిక డిగ్రీ కళాశాల విద్యార్థులు తేలుకుంచి గ్రామంలో ఏర్పాటు చేసిన ఎన్‌ఎస్‌ఎస్ సేవా శిబిరంలో విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి జీవితంలో ఎన్ని అడ్డంకులు ఎదురైనా భయపడి వెనుకడుగు వేయకుండా పట్టుదలతో విజయ పథాన్ని చెరుకోవాలన్నారు. యువత వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. ప్రిన్సిపాల్ కె. శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పిఒ పి.సంతోష్ కుమార్, మాజీ సర్పంచ్ ఎం.సూర్యనారాయణ రెడ్డి, సర్పంచ్ యు.రాజ శేఖర్ రెడ్డి, గ్రామస్తులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటి క్యాంపస్‌ను సందర్శించిన మాజీ ఎమ్మెల్యే

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

మండలంలోని ట్రిపుల్ ఐటి క్యాంపస్‌లో గుంటూరు జిల్లాకు చెందిన విద్యార్థి సృజన్ ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలుసుకున్న ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ శుక్రవారం క్యాంపస్‌ను సందర్శించారు. డైరెక్టర్ బాలాజీతో మాట్లాడి సంఘటనకు గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ ఏడాది కాలంలో నలుగురు విద్యార్థులు ఆత్మహత్యకు పాల్పాడటం బాధాకరమన్నారు. యాజమాన్య నిర్లక్ష్యం స్పష్టంగా కనిపించడమే కాకుండా క్యాంపస్‌లో ర్యాగింగ్ వలన దుర్ఘటన జరగగా చనిపోయిన విద్యార్థిపై చెడు వ్యసానాలకు లోనైనట్లు అభాండాలు మోపడం దారుణమన్నారు. ఇంత జరుగుతున్నప్పటికీ ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో జిల్లా వైసిపి జనరల్ సెక్రటరీ సనపల నారాయణరావు, ఎంపిపి ప్రతినిధి జరుగుళ్ల శంకర్, సర్పంచ్‌లు కోన సూర్యారావు, తండ్యాల లక్ష్మణరావు, ఎంపిటిసి శీరపు శ్రీరామ్మూర్తి, కోటిపాత్రుని శివ, రామానుజం తదితరులు పాల్గొన్నారు.

20కి పరీక్ష వాయిదా

టెక్కలి : బాలల దినోత్సవం సందర్భంగా శుక్రవారం నిర్వహించాల్సిన ఎస్‌ఎ పరీక్ష వాయిదా పడింది. ప్రస్తుతం ఎస్‌ఎ పరీక్షలు జరుగుతున్నాయి. అయితే షెడ్యూల్ ప్రకారం శుక్రవారం సైన్స్ పరీక్ష జరగాల్సి ఉండగా బాలల దినోత్సవం సందర్భంగా వాయిదా పడడంతో ఈ పరీక్ష ఈ నెల 20న నిర్వహించాలని పరీక్షల బోర్డు ఛైర్మన్ వెల్లడించారు. ఒకటవ తరగతి నుంచి 5వతరగతి వరకు పరిసరాల విజ్ఞానం పరీక్ష జరగాల్సి ఉంది. 6, 7 తరగతులకు సైన్స్ పరీక్ష జరగాల్సి ఉండగా 8 నుంచి పదోతరగతి వరకు భౌతిక రసాయన పరీక్ష జరగాల్సి ఉంది. ఇవన్నీ వాయిదా పడ్డాయి.


భర్త మృతదేహానికి తలకొరివి పెడుతున్న భార్య

భర్తకు తలకొరివి పెట్టిన భార్య

కోటబొమ్మాళి: మండలంలోని జర్జంగి పంచాయతీ గుంజిలోవకు చెందిన తిర్లంగి లక్ష్మణరావు (35) శుక్రవారం తన స్వగృహంలో అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన భార్య రోహిణి భర్తకు తలకొరివి పెట్టడంతో అంత్యక్రియలకు హాజరైన ప్రతిఒక్కరు కంటతడి పెట్టుకున్నారు. ఈయనకు కుమారులు శ్రావన్, నితిన్, తల్లి ఉన్నారు. ఈయన అందరితోనూ మంచితనంగా ఉండడంతో మరణవార్త విన్న పరిసర గ్రామాలైన ఊడికలపాడు, కోటబొమ్మాళి, కొత్తపేట, జర్జంగి, హరిశ్చంద్రపురం, యలమంచిలి, వెంకన్నపేట గ్రామాలకు చెందిన వందలాదిమంది స్నేహితులు, బంధువులు అంతిమయాత్రలో పాల్గొన్నారు. వీరితో పాటు పలు రాజకీయ పార్టీలకు చెందిన ప్రముఖులు మృతదేహానికి అంజలి ఘటించారు.


తుప్పలు తొలగిస్తున్న జెసిబి

తుప్పలు తొలగించారు

కవిటి: మండలంలోని ప్రగడపుట్టుగ గ్రామం నుంచి జల్లుపుట్టుగ వెళ్లే రహదారికి రోడ్డుకు ఇరువైపులా ఉన్న తుప్పలు శుక్రవారం ఉదయం తొలగించారు. గోతులు, తుప్పలతో ఉన్న ఆ రహదారిని ఇటీవల స్థానిక సర్పంచ్ పూడి లక్ష్మణరావు పరిశీలించారు. స్థానిక రైతులతో మాట్లాడి వారం రోజుల్లోగా తుప్పలు తొలగించి గోతులు కప్పే కార్యక్రమం చేస్తానని హామీ ఇచ్చారు. చెప్పినట్టుగానే తుప్పల తొలగించడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అదే విధంగా గోతులు కూడా కప్పి తాము ప్రశాంతంగా ప్రయాణించేందుకు సహకరించాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

మధుమేహంపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

ప్రపంచ మధుమేహ దినోత్సవం సందర్భంగా డాక్టర్ అన్నెపు శశిధర్ (జనరల్ మెడిసిన్) ఆధ్వర్యంలో డా.శశిధర్ ఆస్పత్రిలో శుక్రవారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి 150 డయోబిటిక్ నియంత్రణ కిట్లు అందజేశారు. మధుమేహ నియంత్రణ పద్ధతులు, తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ జీవనశైలి మార్పులు, వైద్య పరీక్షలు, వ్యాయామం వంటివి కీలకమన్నారు.


కిట్లు అందజేస్తున్న డాక్టర్ శశిధర్

వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి- పోలాకి

మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చనతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల ప్రభుత్వం కూటమి ప్రభుత్వమని పేదల ఆరోగ్య పరిరక్షణ గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు ప్రజలకు మేలు జరుగుతుందని తెలిపారు. ఎంతో ఖర్చుతో కూడిన మామోగ్రఫీ పరీక్షలతో పాటు గర్భాశయం ముఖద్వారం పరీక్షలు ఉచితంగా చేయడం జరుగుతుందని తెలిపారు. జెమ్స్ ఆస్పత్రి యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు మిరియాపల్లి వెంకటప్పల నాయుడు, పిఎసిఎస్ చైర్మన్ భైరి భాస్కరరావు, సర్పంచ్ మజ్జి రమణమ్మ, సూరపు నారాయణ దాసు, కిల్లి వేణుగోపాలస్వామి, మైలిపల్లి త్రినాథరావు, వైద్యులు శ్రీనాథ్, విస్తరణాధికారి రవికుమార్, సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు.

బకాయిలను తక్షణమే చెల్లించాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

పెన్షనర్ల పాత పిఆర్‌సి డిఆర్ బకాయిలను తక్షణమే చెల్లించాలని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బొడ్డేపల్లి జనార్ధనరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని సబ్ ట్రెజరీ కార్యాలయ ఆవరణలో రిటైర్డ్ పర్సన్స్ కార్యవర్గ సమావేశం దాస్యం లక్ష్మణరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి బొడ్డేపల్లి జనార్ధనరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పెన్షనర్ల పాత పిఆర్‌సి డిఆర్ బకాయిలను చెల్లించాలన్నారు. సంఘ గౌరవఅధ్యక్షులు బొడ్డేపల్లి మోహనరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెన్షనర్ల సమస్యలపై అనుసరిస్తున్న వైఖరిని తీవ్రంగా ఖండించారు. కార్యక్రమంలో కోశాధికారి హెచ్.వి సత్యనారాయణ, పెన్షనర్లు బెండి సూర్యనారాయణ, పి.వి.నరసింహులు, పి.బానోజీరావు, కె.జనార్ధనరావు, కె.సంజీవరావు, బి. నారాయణరావు, బి.చిట్టయ్య, నూక సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



కుర్చీలు అందజేస్తున్న క్లబ్ ప్రతినిధులు

కెజిబివికి కుర్చీలు వితరణ

కంచిలి: మండలంలోని జాడుపూడి కస్తూరిబా పాఠశాలకు సోంపేటకు చెందిన లయన్స్‌క్లబ్ ప్రతినిధులు 14 కుర్చీలను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు గోపి కిరణ్, సభ్యులు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి తమవంతు చేయూత అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ వాణి కుమారి, సభ్యులు ఈశ్వరరావు, సుమన్, క్రాంతి, శ్రీరామ్, చింటూ పాల్గొన్నారు.

ప్లేట్లు వితరణ

నందిగాం: మండలంలోని లఖిదాసుపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం చిలుకు కృష్ణారావు ఔదార్యాన్ని చాటుకున్నారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాల్లో చదువుతున్న 96 మంది విద్యార్థులకు భోజనం ప్లేట్లు వితరణగా శుక్రవారం విద్యాకమిటీ చైర్మన్ చమళ్ల సీతారాం చేతుల మీదుగా అందించారు. ఉపాధ్యాయులు కురమాన దాలయ్య, తులసీప్రసాద్, నాగేశ్వరమూర్తి, గోవిందరాజు, బెందాళం రత్నం, ప్రియదర్శిని పాల్గొన్నారు.

ఆఫ్‌షోర్ నిర్వాసితుల స్థలాలు పరిశీలన

పలాస: మండలం గోపి వల్లభపురం రెవెన్యూ పరిధిలో ఉన్న ఆఫ్‌షోర్ రిజర్వాయర్ నిర్వాసితుల కాలనీలో మిగిలిన స్థలాలను శుక్రవారం తహశీల్దార్ టి.కళ్యాణ చక్రవర్తి పరిశీలించారు. రేగులపాడుకు చెందిన ఐదు మందికి ఇళ్ల స్థలాలు కేటాయించకపోవడంతో వారికి స్థలాలు కేటాయించాలని అందులో భాగంగా కాలనీలో సర్వే చేపట్టి మిగిలిన స్థలాలను గుర్తించి నిర్వాసితులకు పంపిణీ చేస్తామన్నారు. ఆయనతో రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బ్యాంకింగ్ సేవలపై అవగాహన

పొందూరు: విద్యార్థులు బ్యాంకింగ్ సేవలపై అవగాహన పెంచుకోవాలని శ్రీకాకుళం ఎస్‌బిఐ మేనేజర్ వీరభద్రరావు అన్నారు. మండలం కింతలి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఒఎఎస్ ఒకేషనల్ విద్యార్థులకు శ్రీకాకుళం డేఅండ్‌నైట్ కూడలిలో గల ఎస్‌బిఐలో ఆన్‌దిజాబ్ శిక్షణను నిర్వహించారు. బ్యాంకింగ్ రంగంలో డిజిటల్ కార్యకలాపాలు, డిపాజిట్లు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జె.సునీత, అధ్యాపకులు సనపల రమణమూర్తి, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కృషి వికాస్ యోజన పథకంపై శిక్షణ

ఎచ్చెర్ల: మండల పరిధిలో పొన్నాడ పంచాయతీలో అగ్రికల్చర్ కార్యాలయంలో రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకంలో భాగంగా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో కృషి వికాస్ కేంద్రం ఆమదాలవలస శాస్త్రవేత్త డా. జి.ఎస్. రాయ్, రైతు శిక్షణా కేంద్రం ఎడిఎ ఎంటిఎల్ ఎస్. విజయ వరి, మొక్కజొన్న, చోడి, అపరాల పంటలపై ధర్మవరం, పొన్నాడలో రైతులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రజిని, మండల ఎఒ రాజేశ్వరరావు, గ్రామ పెద్దలు నీలమప్పడు, సత్యనారాయణనాయుడు, అల్లు కన్నబాబు, రుప్ప రమేష్, రాంబాబు, ముద్దాడ వెంకటరమణ, రైతులు, విఎఎలు పాల్గొన్నారు.

ఆటో బోల్తా

పర్లాకిమిడి: గజపతి జిల్లా కాశీనగర్‌లోని స్మార్ట్‌పబ్లిక్ స్కూల్ విద్యార్థులను తడవ ఘాట్ పంపు నాలో (కాలువ) వద్దకు పిక్నిక్‌కు ఆటోల్లో తీసుకువెళుతుండగా ఒక ఆటో అదుపు తప్పి బోల్తా పడిన సంఘటనలో డ్రైవర్, 15 మంది విద్యార్థులకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని కాశీనగర్ సమూహ ఆస్పత్రికి తీసుకురాకుండా పర్లాకిమిడిలోని ఒక ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు.. అక్కడ నుంచి పాతపట్నం ప్రయివేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. వారిలో ఒక విద్యార్థికి కాలు విరిగినట్లు సమాచారం. ఆటో డ్రైవర్‌ను అక్కడి నుంచి శ్రీకాకుళం ఆస్పత్రికి తరలించారు. డ్రైవర్‌కు కాళ్లు విరిగిపోయినట్లు సమాచారం. డ్రైవర్ భూపతి లక్ష్మీపురం గ్రామానికి చెందిన మధుగా గుర్తించారు. కాశీనగర్ ఐఐసి సునీల్ కుమార్ బెహరా విషయం తెలుకొని ఘటన స్థలానికి వెళ్లగా అక్కడ ఖాళీ ఆటో ఉన్నట్లు గుర్తించామని, క్షతగాత్రులను పాతపట్నం ప్రయివేట్ ఆస్పత్రికి తీసుకు వెళ్లినట్లు తెలిసిందని, కేసును దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

ప్రజాశక్తి- అరసవల్లి

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని పలువురు వక్తలు కొనియాడారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను విశ్రాంత నైర వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్ డా. ఆరికతోట కనకరాజు జాతీయ జెండా ఆవిష్కరణ చేసి ప్రారంభించారు. అనంతరం కేంద్ర గ్రంథాలయ ఆడిటోరియంలో నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా వయోజన విద్య ఉప సంచాలకులు అల్లు సోమేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయాలను వినియోగించుకుని ఆదర్శవంతులు అవ్వాలని కోరారు. కార్యక్రమంలో విశ్రాంత గ్రంథాలయాధికారి డి.గోపాలరావు, రమణ మూర్తి, ప్రముఖ సంఘ సేవకులు సోడవరం ఈశ్వరరావు, జిల్లా గ్రంథాలయ కార్యదర్శి వివిజిఎస్ శంకరరావు, అసిస్టెంట్ లైబ్రేరియన్ పి వి భాస్కర రాజా, సిబ్బంది ప్రత్యూష, కళ్యాణి, వరలక్ష్మి, రామ్మోహన్, గణేష్ పాల్గొన్నారు.

నందిగాం: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి ఎస్. ఉదయ్ కిరణ్ అధ్యక్షతన 58వ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు అక్కురాడ చంద్రకళ, కొన్ని జయరామ్, నీటి సంఘం అధ్యక్షులు కొన్ని సతీష్ కుమార్, మట్టా భవానీకుమార్, ప్రదీప్ కుమార్ పాణిగ్రహి జవహర్‌లాల్ నెహ్రూ 136వ జయంతి సందర్భంగా పూలమాల వేసి జ్యోతి ప్రజ్వలన చేసి నివాళ్లర్పించారు. ముందుగా గ్రంథాలయాధికారి విద్యార్థులతో గ్రంథాలయ వారోత్సవాల ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు రాములమ్మ, స్థానికులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లావేరు: గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంఇఒ మజ్జి మురళీకృష్ణారావు అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో వారోత్సవాలను ఆయన ప్రారంభించారు. బాలల దినోత్సవం సందర్భంగా నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంఇఒ కార్యాలయ సిబ్బంది పి.నాగరాజు, హైస్కూల్ పిడి జె.సుదర్శనం, గ్రంథాలయ సహాయకులు వీరభద్రుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

బూర్జ : స్థానిక శాఖా గ్రంథాలయంలో వారోత్సవాలు నిర్వహించారు. స్థానిక సర్పంచ్ వేగు అనురాధ, ఎంఇఒలు ధనుంజయరావు, శ్యాంసుందర్రావు, ఎంపిపి స్కూల్ హెచ్ఎం దయాసాగర్, ఉపాధ్యాయులు మనోజ్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.

కొత్తూరు: స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి టి.ఇందిరా అధ్యక్షతన గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించారు. వైస్ ఎంపిపి లోతుగెడ్డ తులసీ వరప్రసాదరావు జ్యోతి ప్రజ్వలన చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పడాలి కృష్ణవేణి, ఎంపిటిసి ప్రతినిధి గండివలస ఆనందరావు, ఎంఇఒ సిహెచ్ గోవిందరావు, మాజీ సర్పంచ్ తాతబాబు, ప్రిన్సిపాల్ కలమట శ్రీరాములు, టిడిపి నాయకులు బొర శ్రీరాములు, వెంకట కృష్ణ, ఎస్.ఉదయ్ కుమార్ పాల్గొన్నారు.

మెళియాపుట్టి: స్థానిక శాఖా గ్రంథాలయంలో బాలల దినోత్సవం సందర్భంగా నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి అధికారులు నివాళ్లర్పించారు. కార్యక్రమంలో స్థానిక ఎస్ఐ పి. రమేష్‌బాబు, ఎంఇఒలు ఎస్.దేవేందర్‌రావు, ఎం.పద్మనాభరావు, గ్రంథాలయాధికారి ఆర్. అనురాధ, మాజీ అధికారి కాళ్ల రాజు, అనిల్ మాస్టర్ తదితరులు పాల్గొన్నారు.

సంతబొమ్మాళి: మండలంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ పిలక రవికుమార్ రెడ్డి, కార్యదర్శి ఉప్పాడ ఉమాపతి, సచివాలయ సిబ్బంది, ఎంపిపి స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు, శ్రీ సత్యసాయి విద్యానికేతన్ ప్రతినిధి ఎం.చంద్రశేఖర్, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులతో పాటు గ్రామ పాఠకులు హాజరయ్యారు. గ్రంథాలయాధికారి ఎ.పోలయ్య, సహాయకుడు ఎన్. ప్రసాద్ వారోత్సవాలను ప్రారంభించారు.

పోలాకి: స్థానిక శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి కె.మానస ఆధ్వర్యంలో గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభించారు. నియోజకవర్గం సమన్వయకర్త బగ్గు అర్చన పాల్గొని నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు ఎం.వెంకట అప్పలనాయుడు, సర్పంచ్ మజ్జి రమణమ్మ, ఎంపిటిసి ప్రతినిధి టి.అశోక్‌కుమార్, భైరి భాస్కరరావు, కిల్లి వేణు, హరి, కె.చిన్నబాబు, లుకలాపు చిన్నబాబు, అంగన్వాడీ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.


నందిగాం : నెహ్రూ చిత్రపటానికి నివాళ్లర్పిస్తున్న నాయకులు

ఆమదాలవలస : పట్టణంలోని బొడ్డేపల్లిపేట వద్దనున్న గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ ఉద్యమ సంస్థ కన్వీనర్ బుడుమూరు సూర్యారావు నెహ్రూ చిత్రపటానికి పూలమాలవేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి అన్నెపు కోటేశ్వరరావు, పురపాలక సంస్థ ఎఇ డి.మనోహరరావు, తమ్మినేని సూర్యనారాయణ, పాఠకులు పాల్గొన్నారు.

సోంపేట: గ్రంథాలయ వారోత్సవాలు సందర్భంగా కొర్లం బాబూజీ గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రముఖ మనోవికాస నిపుణులు రాంబుడ్డి గణపతి పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో గ్రంథాలయ సభ్యులు చందు, తారక్, సంతోష్, రాము, యాదగిరి, యువకులు, గ్రామస్తులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం సిటీ : ప్రభుత్వ మహిళా కళాశాలలో వైస్ ప్రిన్సిపాల్ చిన్నారావు ఆధ్వర్యంలో గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలోఅకడమిక్ కో-ఆర్డినేటర్ కె.మౌనిక, పద్మావతి, ఆదిలక్ష్మి, లైబ్రేరియన్ పిఎల్‌పి భారతి పాల్గొన్నారు.


సమీక్ష చేస్తున్న జెడ్‌పి చైర్‌పర్సన్ విజయ

కోటి సంతకాలపై సమీక్ష

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మండలంలో చేపట్టిన కోటి సంతకాల సేకరణపై జెడ్‌పి చైర్‌పర్సన్, నియోజకవర్గ ఇన్‌ఛార్జి పిరియా విజయ సమీక్ష నిర్వహించారు. స్థానిక ఎంపిపి ఛాంబర్‌లో పార్టీ నేతలు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలతో సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపిపి బోర పుష్ప, పాతిర్ల రాజశేఖరరెడ్డి, వైస్ ఎంపిపి దువ్వు వివేకానంద రెడ్డి, మాజీ ఎంపిపి కారింగి మోహనరావు, మండల సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, కార్యకర్తలు పాల్గొన్నారు.


వంటగది వద్ద గణపతి

ఆదర్శంగా నిలిచారు

ప్రజాశక్తి- కవిటి

పాఠశాల ప్రాంగణంలో పాడైన వంటగదిని సొంత డబ్బులతో బాగు చేయించి కొజ్జిరియా ఉపసర్పంచ్ జి.గణపతి ఆదర్శంగా నిలిచారు. తన పంచాయతీలోని రఘు నాథపురం ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఉన్న వంటగది రేకులు పూర్తిగా పాడయ్యాయి. ఆ స్థితిలో భవనంలోనే వంటలు చేస్తుండడం ఇబ్బందికరంగా ఉండడంతో ఉప సర్పంచ్ ప్రతినిధి గణపతి తన సొంత డబ్బులు రూ.15 వేలతో వంటగదికి కొత్త రేకులు వేయించి మరమ్మతులు చేయించారు. దీంతో పాఠశాల హెచ్ఎంతో పాటు స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.


కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న పిఒ

అంగన్వాడీ కేంద్రం తనిఖీ

టెక్కలి: మండలంలోని కె.కొత్తూరులోని అంగన్వాడీ కేంద్రాన్ని ఐసిడిఎస్ పిఒ శతపతి విద్య శుక్రవారం ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేపట్టారు. కేంద్రం పరిధిలో నిర్వహిస్తున్న పోషక్ సమృద్ధి యోజన పథకంపై సమీక్ష నిర్వహించారు. కేంద్రం నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. బడిఈడు బాలబాలికలు, అంగన్వాడీ పిల్లలకు పలు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సరస్వతి, కార్యకర్త స్వాతి, సంధ్య, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడలకు మాణిక్యపురం విద్యార్థులు

ప్రజాశక్తి- కవిటి

మాణిక్యపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి ముగ్గురు విద్యార్థినులు రాష్ట్రస్థాయి అండర్ -19 (ఎస్‌జిఎఫ్) బేస్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న సమీరా బిసాయి, అంజలి బిసాయి, 10వ తరగతి చదువుతున్న నౌపడ ఝాన్సీ రాష్ట్రస్థాయి జట్టులో చోటుదక్కించుకోవడంతో పాఠశాల వర్గాలు ఆనందం వ్యక్తం చేశాయి. ఈ సందర్భంగా హెచ్ఎం మజ్జి వైకుంఠరావు మాట్లాడుతూ ఈ నెల 15 నుంచి 17 వరకూ అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు ప్రభుత్వ జూనియర్ కాలేజీలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో ఈ ముగ్గురు విద్యార్థినులు పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో ఉపాధ్యాయ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొని విద్యార్థినులను అభినందించారు. వారికి శిక్షణనందించిన వ్యాయామ ఉపాధ్యాయులు రవికుమార్ మహంతి, ఎం.తోటారావు సేవలను ప్రశంసించారు.


ఎంపికైన విద్యార్థులతో హెచ్ఎం వైకుంఠరావు



మాట్లాడుతున్న టిడిపి నాయకులు

ధర్మానకు అభివృద్ధి నచ్చదు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావుకు అభివృద్ధి అంటే నచ్చదని, అందుకే పి-4 విధానంపై అవగాహన లేని వ్యాఖ్యలు చేస్తున్నారని ఎపి విద్య సంక్షేమ మౌలిక వసతుల అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ పిఎం జె బాబు, టిడిపి నాయకులు మండిపడ్డారు. నగరంలోని 80 అడుగుల రహదారిలో టిడిపి కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే గొండు శంకర్ విశేష కృషి చేస్తున్నారన్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం సమాంతరంగా ముందుకు వెళుతున్నా యని పేర్కొన్నారు. ఆమదాలవలస, శ్రీకాకుళం ప్రధాన రహదారిని రెవెన్యూ మంత్రిగా ఉండి కూడా ధర్మాన పూర్తి చేయలేకపోయారన్నారు. దమ్ముంటే అభివృద్ధి, అవినీతి విషయంలో బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. ఇప్పటికైనా ధర్మాన అనవసర విమర్శలు ఆపాలని సూచించారు. సమావేశంలో చిన్న, మధ్యతరహా కార్పొరేషన్ డైరెక్టర్ ప్రధాన విజయరామ్, టిడిపి నగర అధ్యక్షులు పాండ్రంగి శంకర్, రూరల్ మండల అధ్యక్షులు మోకళ్ల శ్రీను, అంపోలు పిహెచ్‌సి చైర్మన్ గొండు వెంకటరమణమూర్తి పాల్గొన్నారు.

మెలకువలు నేర్చుకోవాలి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ప్రతి విషయాన్ని కుణ్ణంగా పరిశీలించి వృత్తిపరమైన మెలకువలు నేర్చుకోవాలని ఇంటర్మీడియట్ జిల్లా పర్యవేక్షణ అధికారి చింతాడ శరత్‌బాబు అన్నారు. స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఎంపిహెచ్‌డబ్ల్యు ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులకు చేపడుతున్న ప్రత్యేక ఒజిటి కార్యక్రమాన్ని శుక్రవారం శరత బాబు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రిలో వివిధ విభాగాల విద్యార్థులకు వైద్యులు, సిబ్బంది పర్యవేక్షణలో పొందుతున్న శిక్షణను పరిశీలించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ దేవేంద్ర రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ నవ్యశ్రీ మహంతి, ఎజిఎంఒ ప్రియ సుధాకర్, శాంతిశ్రీ, లత తదితరులు పాల్గొన్నారు.


శిక్షణను పరిశీలిస్తున్న శరత్‌బాబు

క్షతగాత్రులకు మాజీ మంత్రి పరామర్శ

ప్రజాశక్తి- పలాస

వజ్రపుకొత్తూరు మండలం నువ్వలరేవు ఎంపిపి స్కూల్‌లో మధ్యాహ్న భోజనం వండుతున్న సమయంలో ప్రెజర్ కుక్కర్ పేలి ముగ్గురు మహిళలకు తీవ్రమైన గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు పలాస ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళలను పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి క్షతగాత్రులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని సూచించారు. అనంతరం క్షతగాత్రులకు తనవంతుగా ఆర్థిక సహాయం అందజేశారు. ఆయనతో పాటు వైసిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.


క్షతగాత్రులను పరామర్శిస్తున్న మాజీ మంత్రి అప్పలరాజు


సదరం కోసం వేచి ఉన్న వికలాంగులు

సదరాన్ని వినియోగించుకోవాలి

వజ్రపుకొత్తూరు: వికలాంగులు సదరం అవకాశాన్ని వినియోగించుకోవాలని టిడిపి 31వ యూనిట్ కన్వీనర్ కదంబాల వెంకటరమణ కోరారు. శుక్రవారం నువ్వలరేవులో వికలాంగుల కోసం సదరం శ్లాట్ బుకింగ్ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. సదరం ధ్రువీకరణ పత్రాలను ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందని, సదరం ధ్రువీకరణ పత్రాలుంటే సామాజిక పింఛన్, బస్సు, రైలు ప్రయాణంలో రాయితీ పొందవచ్చని తెలిపారు. ప్రభుత్వపరమైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మువ్వల పూర్ణచంద్ర, బూత్ కన్వీనర్ లోకనాథ్ బెహరా, సిబ్బంది సంతోష్, కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

సోంపేట: వేధింపుల నుంచి మహిళలు, బాలికలు రక్షణ పొందేందుకు అమల్లో ఉన్న చట్టాలపై స్థానిక కె.ఆర్ కళాశాల విద్యార్థులకు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ఎస్ఐ లవరాజు ఆధ్వర్యంలో సిబ్బంది ప్రస్తుతం అమల్లో ఉన్న మహిళ చట్టాలపై అవగాహన కల్పించారు. విద్యార్థి దశలో క్రమశిక్షణతో కూడిన విద్య అభ్యసించాలన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో కళాశాల నిర్వహకులతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

తెలుగు మహాసభకు ఆహ్వానం

రణస్థలం: తెలుగు భాషా సంస్కృతి పరిరక్షణ అభివృద్ధి, విశ్వవ్యాప్తి లక్ష్యంగా ఆంధ్ర సారస్వత పరిషత్ ఆంధ్రప్రదేశ్ ఆత్మీయుల సహకారంతో నిర్వహిస్తున్న 3వ ప్రపంచ తెలుగు మహాసభలు 2026 జనవరి 3, 4, 5 తేదీల్లో గుంటూరులో నందమూరి తారక రామారావు వేదికపై జరగనున్నాయని ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షులు డాక్టర్ గజల్ శ్రీనివాస్, సమన్వయకర్త రామచంద్ర రాజు, తెలుగు సంఘాల ముఖ్య సమన్వయకర్త కొల్లి రమావతి ఆహ్వానం పంపారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా జరిగే ఈ సభలకు శ్రీకాకుళం జెండావీధికి చెందిన ప్రముఖ కవి, రచయిత మహ్మద్ రఫీ (ఈవేమన)కు ప్రతినిధిగా ఆహ్వానం అందినట్లు ప్రకటనలో తెలిపారు.

టెన్నికాయిట్‌కు విద్యార్థి ఎంపిక

పలాస: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫస్ట్ బిఎస్‌సి కంప్యూటర్ సైన్స్‌లో విద్యనభ్యసిస్తున్న కొవ్వూరు ప్రవీణ్ కుమార్ జాతీయ స్థాయి టెన్నికాయిట్ పురుషుల విభాగంలో పాల్గొనేందుకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె.వెంకటలక్ష్మి తెలిపారు. ఇటీవల పలాస ప్రభుత్వ క్రీడా మైదానంలో జరిగిన అంతర్ కళాశాల టెన్నికాయిట్ పోటీల్లో ద్వితీయ స్థానం సాధించిన ప్రవీణ్, అనంతరం బాపట్ల జిల్లా చీరాలలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లా టెన్నికాయిట్ పోటీల్లో మొదటి ఆరుస్థానాల్లో చోటు దక్కించుకొని తన ప్రతిభను నిరూపించాడు. త్వరలో జమ్మూ-కాశ్మీర్‌లో జరగనున్న జాతీయ స్థాయి టెన్నికాయిట్ క్రీడలకు ప్రవీణ్ ఎంపికయ్యాడని కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ పి.మధు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు ప్రవీణ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.